సాక్షి
వనపర్తి
సోమవారం । 21 । అక్టోబర్ । 2024

కఠోర శ్రమతోనే ఉన్నతస్థాయికి..



- ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి
- 50 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ
- సంజీవని క్లినిక్ ఆన్ వీల్స్ ప్రారంభం

వివరాలు 10లో ▸

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వనపర్తిటౌన్: జిల్లా జనరల్ ఆస్పత్రితో పాటు పలు కాలనీల్లో సోమవారం ఉదయం 8 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజయ్యగౌడ్ తెలిపారు. కొత్తకోట రోడ్‌లో పాత విద్యుత్ స్తంభాలు మార్చడం, తీగలు లాగే పనులు చేపడుతున్నందున సరఫరా ఉండదని, వ్యాపారులు, వినియోగదారులు గమనించాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాల సబ్‌స్టేషన్ రోడ్డు, వల్లభ్‌నగర్, కేడీఆర్‌నగర్, రాంనగర్, బసవన్నగడ్డ, బ్రహ్మంగారి వీధిలోని కొంతభాగం, సుభాష్‌వాడ, పాతబస్టాండ్, రాజీవ్‌చౌక్, అంబేడ్కర్‌చౌరస్తా, బీఎస్ఎన్ఎల్, పుర కార్యాలయం, బస్‌డిపో రోడ్, శంకర్‌గంజ్, నాగారాం క్రాసింగ్ రోడ్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'మత రాజకీయాలను ప్రతిఘటిద్దాం'



పాన్‌గల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో చేస్తున్న రాజకీయాలను కమ్యూనిస్టులుగా ప్రతిఘటించాలని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసూఫ్, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉమామహేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతులకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై 'సమకాలిన రాజకీయాలు.. కులం, మతం' అనే అంశంపై సుదీర్ఘంగా మాట్లాడారు. దేశాన్ని అదాని, అంబానీవంటి సంపన్నులకు దోచిపెడుతున్న బీజేపీ.. కష్టజీవుల ప్రయోజనాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కులం, మతం, మూఢ నమ్మకాలతో ప్రజల్లో చైతన్యం రాకుండా దేవుడి పేరుతో అడ్డుకుంటుందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాత్ర ఇసుమంత లేదని.. రాజ్యాంగం కల్పించిన హక్కులను మన ధర్మశాస్త్రం అమలు చేసి వెనుకకు నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. అంతకు ముందు పార్టీ పతకాన్ని వారు ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, నాయకులు రమేష్, గోపాల్, గోపాలకృష్ణ, మహేష్, రవీందర్, చంద్రయ్య,లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం




వీపనగండ్ల: సమసమాజ స్థాపనకు ప్రజా ఉద్యమాలు నిర్వహించి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ తెలిపారు. ఆదివారం గోపల్‌దిన్నెలో జరిగిన పార్టీ మండలస్థాయి 7వ మహాసభలకు వారు ముఖఅతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం కావడమేగాక కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నాయని ఆరోపించారు. పార్టీ జిల్లా నాయకుడు ఆంజనేయుడు, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, కృష్ణయ్య, మహబూబ్‌పాషా, మురళి, శాంతమ్మ, ఆశమ్మ పాల్గొన్నారు.

మీ త్యాగం.. మరువలేం!

ఉమ్మడి జిల్లాలో అమరులైన 39 మంది పోలీసులు

- అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 32 మంది
- మహబూబ్‌నగర్‌లో ఇద్దరు, వనపర్తిలో నలుగురు, నారాయణపేటలో ఒకరు
- ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు
- నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



మహబూబ్‌నగర్‌లోని పోలీసు అమరవీరుల స్థూపం

ఉమ్మడి జిల్లాలో అమరులైన పోలీసులు ఇలా..

నాగర్‌కర్నూల్	వనపర్తి
32	4
మహబూబ్‌నగర్	**నారాయణపేట**
2	1

మహబూబ్‌నగర్ క్రైం/కొల్లాపూర్: విధి నిర్వహణలో అసువులు బాసినవీరులు వారు.. ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించే క్రమంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయని నిర్భయులు.. ఎక్కడ బాంబు పేలినా.. ఎక్కడ తుపాకులు గర్జించినా.. వెనకాముందు చూడకుండా దూసుకుపోతారు.. శత్రువులతో జరిగే పోరాటంలో తుదిశ్వాస వరకు పోరాడుతారు. అలాంటి పోరాటాల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల జ్ఞాపకాలు పదికాలాలపాటు పదిలంగా దాచే ప్రయత్నం చేస్తోంది పోలీస్ శాఖ. ఏటా ఒకరోజు వారిని స్మరించుకునే ఏర్పాట్లు చేసింది. కర్తవ్య నిర్వహణలో వెన్నుచూపని ఆ ధీరులను స్మరించుకోవడానికి ప్రతిఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం చేపడుతారు. ఈ క్రమంలోనే సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఇక్కడి నుంచే ప్రకటన

శాంతిభద్రతల పరిరక్షణ కోసం నక్సలైట్ల కాల్పుల్లో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం గతంలో ఎక్స్‌గ్రేషియా చెల్లించేది కాదు. అయితే 1997లో లక్ష్మాపూర్ ఘటనలో మృతి చెందిన వారిని పరామర్శించేందుకు అప్పటి హోంమంత్రి మాధవరెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి వచ్చారు. ఈ క్రమంలో పోలీస్ కుటుంబాలు మంత్రి దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి రూ.1.50 లక్షలు అమరవీరుల కుటుంబసభ్యులకు ఇచ్చేలా ఎస్పీకి అధికారం కల్పించగా.. ఇప్పటికీ కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం ఈ ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలకు పెంచారు. అలాగే ఒక ప్లాటు, రైల్వే ప్రయాణం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తున్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు మహబూబ్‌నగర్‌జిల్లాకేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు.

పథకాలు అందించాం..



జిల్లాలో ఇద్దరు పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు ఉన్నారు. వారికి శాఖాపరంగా అన్ని రకాల సంక్షేమ పథకాలు అందించాం. ప్రతి ఏడాది అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తుచేసుకోవడానికి పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నాం. దీంతోపాటు వారంరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లాలో పోలీస్ అమరవీరులు



1993 దుర్ఘటనలో మరణించిన పోలీసులు

ఉమ్మడి పాలమూరులో మావోయిస్టు తూటాలకు ఇప్పటి వరకు 39 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు.

- 1990లో కోడేరు మండలం తుర్కదిన్నె వద్ద ఎమ్మెల్యే ఇంటిపై మావోయిస్టులు దాడి చేసిన ఘటనలో ప్రభాకర్ అనే కానిస్టేబుల్ బలయ్యాడు.
- 1991లో వంగూర్ పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయగా ఖాజాపాషా అనే కానిస్టేబుల్ మృతిచెందాడు. అదే ఏడాది కొల్లాపూర్‌లోని ఓ హోటల్‌లో ప్రభాకర్ అనే కానిస్టేబుల్ భోజనం చేస్తుండగా నక్సలైట్లు కాల్చిచంపారు.
- 1993లో కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద అప్పటి మహబూబ్‌నగర్ ఎస్పీ పరదేశినాయుడు, సిబ్బందితో కలిసి బస్సులో వెళ్తున్న సమయంలో మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఈ దుర్ఘటనలో ఎస్పీతోపాటు ఇద్దరు ఎస్ఐలు కిషోర్‌కుమార్, శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ రంగారెడ్డి, కానిస్టేబుళ్లు సుభాన్, జహబ్ ఇక్బాల్, జయరాం, వైవీఎస్ ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందారు.
- 1994లో తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌పై మావోయిస్టులు జరిపిన దాడులో ఫయోద్దీన్ అనే కానిస్టేబుల్ మృతిచెందాడు.
- 1996లో కొల్లాపూర్ మండలం కుడికిళ్లలో ఎన్నికల విధుల్లో ఉన్న కానిస్టేబుల్ మురళీధర్ రెడ్డిని నక్సల్స్ కాల్చిచంపారు.
- 1997లో బల్మూర్‌లో పరీక్షల బందోబస్తు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్ నక్సల్స్ తూటాలకు బలయ్యాడు. అదే ఏడాదిలో అమ్రాబాద్ పరిధి లక్ష్మాపూర్ నుంచి ట్రాక్టర్‌లో వెళ్తున్న ఎస్ఐ మాల్యూర్, కానిస్టేబుళ్లు నాగేశ్వరుడు, జగదీశ్వర్‌రెడ్డి, మారెప్ప, శంకరయ్య మందుపాతరలకు బలయ్యారు. అదే ఏడాదిలో అమ్రాబాద్ వద్ద పోలీసులు, నక్సలైట్లకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహబూబ్ అలీఖాన్ అనే కానిస్టేబుల్ మరణించాడు.
- 1999లో వీపనగండ్ల వద్ద నక్సల్స్ పేల్చిన మందుపాతరకు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, గోపాల్ బలయ్యారు.
- 2000 ఏడాదిలో కానిస్టేబుల్ హన్మనాయక్‌ను హతమార్చారు.
- 2001లో హోంగార్డు శ్రీనివాసరాజును అచ్చంపేట పరిధిలోని ఎదిరలో మావోయిస్టులు హతమార్చారు. అదే ఏడాది ఆమనగల్‌లోని కాటన్ మిల్లు వద్ద జరిగిన ప్రమాదాన్ని తెలుసుకునేందుకు వెళ్లిన ఎస్ఐ హన్మంతురెడ్డిని కాల్చి చంపారు.
- 2002లో మన్ననూర్ పండరీ అనే కానిస్టేబుల్ చంపేశారు.



నా పేరు శివరత్నమ్మ ప్రస్తుతం నాగర్‌కర్నూల్ డీఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను. 17.05.1997 లక్ష్మాపూర్ దగ్గర మందుపాతర పేల్చిన ఘటనలో నా భర్త కానిస్టేబుల్ జగదీశ్వర్‌రెడ్డి ఉన్నాడు. నాకు ముగ్గురు పిల్లలు వనిత, వినిత, రాజశేఖర్ రెడ్డి ముగ్గురికి పెళ్లిళ్లు అయ్యాయి. పోలీస్ శాఖ నుంచి అందాల్సిన సంక్షేమ పథకాల్లో ఎక్స్‌గ్రేషియా తక్కువగా ఇచ్చారని గతంలో ఉన్న హోంమంత్రిని సైతం కలిశాను. 1997లో మృతిచెందిన వారికి రూ.1.50 లక్షలు ఇచ్చారు. అంతకు ముందు ఆ తర్వాత వారికి రూ.5 లక్షలు ఇచ్చారు. ఎక్స్‌గ్రేషియా విషయంలో సరైన న్యాయం చేయలేదు.

- 2004లో కొల్లాపూర్ ఎమ్మెల్యే గన్‌మెన్‌గా ఉన్న హుమ్లానాయక్, వెంకటరెడ్డిలను తుపాకీతో కాల్చిచంపారు. అదేఏడాది అడ్డాకుల ఎంపీపీ కందూరు నారాయణ గన్‌మేన్ సుగుణాకర్‌ను కాల్చిచంపారు.
- 2005లో బాలానగర్ ఎస్ఐని హతమార్చేందుకు మావోయిస్టులు రెక్కీ నిర్వహించి.. చివరకు ప్రకాష్ అనే కానిస్టేబుల్ కాల్చారు. ఇదే ఏడాదిలో అచ్చంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట నిల్చొని ఉన్న హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మయ్య, కానిస్టేబుల్ శేఖర్‌నాయక్‌లను మావోయిస్టులు కాల్చిచంపారు.
- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి గన్‌మెన్ రాజారెడ్డి నక్సల్స్ తూటాలకు బలయ్యారు. అలాగే చిన్నచింతకుంట ఎస్ఐ అహ్మద్ మోహియుద్దీన్‌ను పోలీస్‌స్టేషన్ ఎదుటే పట్టపగలు కాల్చి చంపారు.
- 2006లో కొండనాగులలో జహంగీర్ అనే హెడ్‌కానిస్టేబుల్ అదే ఏడాది కూంబింగ్ నిర్వహిస్తున్న జోష్‌బాబు అనే గ్రేహౌండ్ కానిస్టేబుల్‌ను అత్యంత దారుణంగా హతమార్చారు. అదే ఏడాది కొల్లాపూర్ పరిధిలోని సింగోటం వద్ద రమేష్ అనే కానిస్టేబుల్ మావోల తూటాలకు బలయ్యాడు.

వరి కొనుగోళ్లకు సన్నద్ధం

జిల్లాలో 299 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం

- మద్దతు ధర క్వింటాకు రూ.2,320
- సేకరణ లక్ష్యం 4 లక్షల మెట్రిక్ టన్నులు
- ప్రారంభం కాని పంట కోతలు



ఆత్మకూర్ మండలం మూలమళ్ల శివారు జూరాల ఎడమకాల్వ ఆయకట్టులో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

అమరచింత: జిల్లాలో సాగుచేసిన వరి పంటలు మరికొద్ది రోజుల్లో కోతకు రానుండటంతో మరో వారం, పది రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇటీవల కలెక్టర్ ఆదర్శ్ సురభి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి జిల్లావ్యాప్తంగా 299 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మండలాల వారీగా వరి ధాన్యం అధికంగా పండించిన గ్రామాల్లో కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏడాది గన్నీబ్యాగులు సైతం కేంద్రాలకు ముందస్తుగానే తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అధికారులు వెల్లడించారు. గతేడాది యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 90 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసిన అధికారులు.. ఈ ఏడాది వానాకాలంలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని, మద్దతు ధర క్వింటాకు రూ.2,320 చెల్లించాలని నిర్ణయించారు. సన్న రకాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ అందించనుంది. పంట కోతల ఆధారంగా గ్రామాల్లో మరో 10 రోజుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

1,62,392 ఎకరాల్లో సాగు..

జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ ఏడాది వానకాలం రైతులు అధికంగా వరి సాగు చేపట్టారు. జూరాల ప్రధాన ఎడమకాల్వ ఆయకట్టు కింద 85 వేల ఎకరాలు, మిగిలిన జలాశయాలు, ఎత్తిపోతలు, చెరువులు, బోరుబావుల కింద 80 వేల ఎకరాల్లో వరి సాగైంది. పంటలకు ఎలాంటి తెగుళ్ల సోకకపోవడంతో ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు.

కర్ణాటకకు తరలుతున్న ధాన్యం..

కర్ణాటక నుంచి దళారులు వచ్చి ఇక్కడ పండిన వరి ధాన్యాన్ని కల్లాల వద్దే కొనుగోలు చేసి అక్కడి మార్కెట్‌కు తరలిస్తుంటారు. మక్తల్ నియోజకవర్గం సరిహద్దు మండలాలు కర్ణాటకకు సమీపంలో ఉండటంతో రైతులు సైతం అక్కడి మార్కెట్‌కు తరలించే అలవాటు ఉంది. ఈ ఏడాది స్వరాష్ట్రంలోనే ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలనే ఆలోచనలతో అధికారులు గ్రామాల్లో రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పిస్తున్నారు. సన్నరకం వరి ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించాలంటే చాలా సమయం పడుతుందని.. ధాన్యం ఆరబెట్టి ఎదురుచూడలేమని రైతులు చెబుతున్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా నేరుగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

త్వరగా ఏర్పాటు చేయాలి..



అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టు కింద సాగుచేసిన వరి పంటలు మరో పది రోజుల్లో కోతకు రానున్నాయి. రైతు ప్రయోజనాలను కాపాడేందుకు అధికారులు ముందస్తుగా ఆయా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. – రఘురాంరెడ్డి, రైతు, అమరచింత

వారం రోజుల్లో డబ్బులు చెల్లించాలి..



ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. నాణ్యత లేదంటూ ధర తగ్గించకుండా రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని మద్దతు ధర చెల్లించాలి. రవాణా వ్యవస్థ మెరుగుపర్చి కల్లాల వద్దే ధాన్యం కొనుగోలు చేయాలి. సన్నరకాలకు బోనస్ సకాలంలో చెల్లించాలి.

– అరేందర్‌రెడ్డి, రైతు, అమరచింత

మండల కేంద్రాల్లో ప్రారంభించాం

ప్రతి మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. మరో 10 రోజుల్లో గ్రామాల్లోనూ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. లక్ష్యం మేర ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. కేంద్రాలకు ముందగానే గన్నీబ్యాగులు పంపించేందుకు 25 లక్షలు సిద్ధం చేశాం.

– ఇర్ఫాన్, డీఎం, పౌరసరఫరాలశాఖ

సీతాఫల్ మండి



పొలం గట్లు, అడవుల్లో సహజ సిద్ధంగా లభించే సీతాఫలాలు గ్రామీణ ప్రజలకు ఉపాధినిచ్చే వరంగా మారింది. ఏటా సెప్టెంబర్, అక్టోబర్‌లో ఇవి విరివిగా లభిస్తాయి. ఎలాంటి పెట్టుబడి, ఖర్చు లేకుండా సహజ సిద్ధంగా లభించే పండ్లు కావడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పింది. ప్రతి సీజన్‌లో గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి వీటిని సేకరించి.. గుజ్జును వేరు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ ఆదాయం పొందుతోంది. అలాగే ప్రాసెసింగ్ యూనిట్‌కు రైతులు, కూలీలు తెచ్చిన సీతాఫలాలకు కిలో రూ.13 చొప్పున ధర నిర్ణయించి గ్రేడింగ్ చేసి కొనుగోలు చేస్తూ.. వారికి ఉపాధి కల్పిస్తోంది.

– దామరగిద్ద/ నవాబుపేట



దామరగిద్దలో పండ్ల నుంచి గుజ్జు వేరు చేస్తున్న మహిళలు

గ్రామీణులకు ఉపాధి కల్పిస్తున్న సీజనల్ పండ్లు

- దామరగిద్ద, నవాబ్‌పేటలో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు
- గుజ్జు వేరు చేసి పాకెట్లలో సీలింగ్
- కిలోల చొప్పున ఇతర ప్రాంతాలకు ఎగుమతి
- ఇటు ప్రభుత్వానికి.. అటు గ్రామీణులకు ఆదాయం

ప్రాసెసింగ్ యూనిట్‌తో ప్రయోజనం

దామరగిద్ద మండల మహిళా సమాఖ్య భవనంలో ఆరేళ్ల క్రితం ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడంతో ఇటు పేద మధ్య తరగతి వ్యవసాయ కూలీలు, మహిళా సమాఖ్య సభ్యులకు ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ప్రాసెసింగ్ యూనిట్‌కు తెచ్చిన సీతాఫలాలకు కిలో రూ.13 చొప్పున ధర నిర్ణయించి గ్రేడింగ్ చేసి కొనుగోలు చేస్తున్నారు. వీటిని సీతాఫల కాయలను మాగబెట్టి పండ్లుగా మార్చుతారు. పండ్ల నుంచి గుజ్జు, విత్తనాలను కూలీలతో వేరు చేయించి కిలో చొప్పున ప్యాకింగ్ చేస్తున్నారు. ప్యాకింగ్ చేసిన గుజ్జును హార్డ్ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి అనంతరం స్టోరేజ్‌లో భద్రపరుస్తున్నారు. పూర్తిగా తయారైన గుజ్జును కిలో రూ.230 చొప్పున బెనిషా పీఎఫ్ఓ ఆర్గనైజేషన్‌కు విక్రయిస్తున్నారు. అలాగే నవాబుపేటలో గత నాలుగేళ్ల క్రితం సీతాఫలాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఇక్కడి యూనిట్ ద్వారా సీజన్‌లో దాదాపు రోజుకు 25 నుంచి 50 మంది వరకు ఉపాధి పొందుతున్నారు.



దామరగిద్దలో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన గుజ్జు పాకెట్లు

20 రోజుల్లో.. 2 లక్షల లాభం

నవాబ్‌పేటలో చేపట్టిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో గతేడాది రూ.4.86 లక్షల వ్యాపారం నిర్వహించారు. ఇందులో మహిళా సమాఖ్యకు రూ.2.79 లక్షల వరకు లాభం కమీషన్ రూపంలో వచ్చింది. కాగా మొత్తంగా గతేడాది 29 టన్నుల సీతాఫలాలు కొనుగోలు చేశారు. అలాగే మూడున్నర టన్నుల గుజ్జు ఎగుమతి చేశారు. అలాగే 13 టన్నులు సీతాఫల కాయలు సైతం విక్రయించారు. 1,376 మంది రైతులతో సీతాఫలాలు కొనుగోలు చేసి వారికి రూ.250– 480 వరకు డబ్బులు అందించారు. రోజుకు 50 నుంచి 80 మంది వరకు మహిళలకు ప్రాసెసింగ్ యూనిట్‌లో ఉపాధి కల్పించారు.

2,750 వేల కిలోల గుజ్జు

దామరగిద్దలో సెప్టెంబర్ 9న ప్రారంభించిన ప్రాసెసింగ్ యూనిట్‌లో ఇప్పటి వరకు రోజు పదుల సంఖ్యలో కూలీలు సీతఫలాలను తెస్తున్నారు. 15,458 కిలోల సీతాఫలాలను కొని ప్రాసెసింగ్ ద్వారా 2,750 కిలోల గుజ్జును తయారు చేశారు. వీటిలో 1,550 కిలోల గుజ్జును బెనీషా ఐస్‌క్రీం కంపెనీకి విక్రయించారు. మిగిలిన 1,200 కిలోల గుజ్జు విక్రయానికి సిద్ధంగా ఉంది.

ఉపాధి లభిస్తుంది..



కొనుగోలు చేసిన సీతాఫల కాయలను మాగబెట్టి, మాగిన పండ్ల నుంచి గింజలను వేరు చేసి గుజ్జు తీస్తున్నాం. ఈ గుజ్జును వివిధ దశల్లో ప్రాసెసింగ్ చేసి కిలో చొప్పున ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నాం. ప్రాసెసింగ్ యూనిట్‌తో సీజన్ మొత్తం పలువురికి యూనిట్‌లో పనిచేసే వారికి రోజుకు రూ.250 కూలీ లభిస్తుంది. అలాగే ప్రాసెసింగ్ యూనిట్‌కు తెచ్చి విక్రయించే వారు సీజన్‌లో రోజుకు రూ.600 నుంచి రూ.వెయ్యి వరకు ఆర్జిస్తున్నారు.

– అన్నపూర్ణమ్మ, అధ్యక్షురాలు, మండల మహిళా సమాఖ్య దామరగిద్ద

15 వేల కిలోలు కొనుగోలు..



సీతాఫలాల ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ఇప్పటి వరకు 15,458 కిలోల సీతాఫలాలు కొనుగోలు చేశాం. వాటితో 2,750 కిలోల గుజ్జును తయారు చేశాం. వీటిలో 1,550 కిలోల గుజ్జును కిలో రూ.230 చొప్పున విక్రయించాం. రోజుకు వెయ్యి నుంచి 2 వేల కిలోల సీతాఫల కాయలు కొనుగోలు చేస్తున్నాం. పేద, మధ్య తరగతి కూలీలకు మంచి ఉపాధి లభిస్తుంది.

– నర్సింహులు, ఐకేపీ ఏపీఎం, దామరగిద్ద

ఆదర్శంగా నిలుస్తాం



ఈ ప్రత్యేక ప్రాజెక్టు మాకు అందించడం సంతోషం ఉంది. ఈ గొప్ప అవకాశం రావడంతో మండలంలో చాలా మందికి ఉపాధి చూపడంతోపాటు మహిళా సంఘాలు సైతం ఆర్థికంగా లాభపడుతున్నాయి. అలాగే గ్రామస్థాయిలో మహిళలకు సైతం ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక చేసి ఈ కార్యక్రమం మంచి ఫలితం ఇచ్చేలా కృషిచేశాం. ఈసారి ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకుని మరింత క్వాంటిటీ అందించి ఆదర్శంగా నిలుస్తాం. రూ.5 లక్షల లాభం ఆర్జించడమే టార్గెట్‌గా ముందుకు సాగుతున్నాం.

– బాలామణి, అధ్యక్షురాలు, మండల మహిళా సమాఖ్య, నవాబుపేట



నవాబుపేట ప్రాసెసింగ్ యూనిట్‌లో గుజ్జును తూకం చేసి ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

చెరువులో పడి యువకుడు మృతి

నర్వ: మక్తల్ మండలం మంథన్‌గోడ్‌కు చెందిన ఓ యువకుడు నర్వ మండలం రాయికోడ్ చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. మంథన్‌గోడ్‌కు చెందిన పిల్లి మల్లేష్ (23) మతి స్థిమితం కోల్పోయి అప్పుడప్పుడు ఇంటి వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిన మల్లేష్ తిరిగి ఇంటికి రాకపోవడంతో అక్క జయమ్మ చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడ వెదికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం రాయికోడ్ శివారులోని చెరువులో మృతదేహం కనిపించడంతో చుట్టుపక్కల రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి జయమ్మకు తెలియజేశారు. ఆమె వచ్చి మృతదేహం తన తమ్ముడిదేనని నిర్ధారించారు. అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బ్లాస్టింగ్‌తో విద్యార్థికి గాయాలు

వంగూరు: మండలంలోని నర్సంపల్లి సమీపంలో డీఎల్‌ఐ కాల్వ నిర్మాణ పనుల్లో చేపట్టిన బ్లాస్టింగ్‌తో గ్రామానికి చెందిన రిషితేజకు రాయి తగిలి తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఇంటి వద్ద ఉన్న పదో తరగతి విద్యార్థి రిషితేజకు అకస్మాత్తుగా రాళ్లు ఎగిరివచ్చి తగలడంతో కుడి చేయికి గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వెల్దండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

మాజీ సర్పంచ్‌పై దాడి చేసిన వ్యక్తి రిమాండ్

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేట మాజీ సర్పంచ్ సతీష్‌కుమార్‌పై భూ తగాదాల విషయంలో ఈ నెల 8న దాడి జరిగింది. దాడి చేసిన వ్యక్తుల్లో ఒకరైన రాజనాల ఆంజనేయులు (ఏ2)ను పట్టుకుని మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు. ఈ మేరకు ఆంజనేయులును ఆదివారం రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే ఏ1గా ఉన్న మరో వ్యక్తి రాజనాల బాలరాజు పరారీలో ఉన్నాడని, త్వరలో అతన్ని పట్టుకుని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

పూరిగుడిసె దగ్ధం

ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని కోదండాపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకలి సుధాకర్ గుడిసెకు ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలానికి స్థానిక రెవెన్యూ సిబ్బంది చేరుకొని పంచనామా నిర్వహించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎర్రవల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. మండలంలోని కొండేపేట సమీపంలో ఒక ట్రాక్టర్, ఎర్రవల్లి సమీపంలో మరొక ట్రాక్టర్ శనివారం అర్ధరాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నాయి. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తనిఖీ చేసి వాటిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించి యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టిప్పర్ సీజ్

నవాబుపేట: మండలంలోని కారూర్ సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. రాజాపూర్ మండలం చెన్నవెల్లికి చెందిన స్వామిరెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా ఉదండాపూర్ నుంచి టిప్పర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. టిప్పర్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కృష్ణమ్మ పరవళ్లు..

- జూరాలకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 20 గేట్ల ద్వారా నీటి విడుదల
- 11 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి


జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ


సుంకేసుల డ్యాం నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ధరూరు/ఆత్మకూరు/రాజోళి: ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద నిలకడగా కొనసాగుతుంది. ఆదివారం సాయంత్రం 1.20లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... రాత్రి 9 గంటలకు లక్ష క్యూసెక్కులకు తగ్గింది. దీంతో ప్రాజెక్టు 20 క్రస్టు గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 34,179 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. గేట్ల ద్వారా 81,980 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 47 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాలువకు 731 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 1,17,857 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.850 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి పూర్తిస్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 127.83 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు 58,595 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి 60,620 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు 84,646 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు 18 క్రస్టు గేట్లను ఎత్తి 88,811 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 32.14 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెప్పారు.

- జూరాల దిగువ, ఎగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా వేగవంతంగా కొనసాగుతుంది. ఆదివారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 289.618 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 269.875 ఎంయూ ఉత్పత్తిని చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 559.493 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

సుంకేసులలో 16 గేట్లు ఎత్తివేత

తుంగభద్ర నదిపై ఉన్న సుంకేసుల డ్యాం 16 గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఆదివారం ఎగువ నుంచి 70,150 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. గేట్ల ద్వారా 67,132 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశామని, అలాగే కేసీ కెనాల్ 2,095 క్యూసెక్కులు వదిలినట్లు పేర్కొన్నారు.

నిరుద్యోగులకు టోకరా!

ఆరోగ్యశాఖలో ఉద్యోగమంటూ రూ. లక్షలు వసూలు



- జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రైవేటు కారు డ్రైవర్ నిర్వాకం
- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

గద్వాల క్రైం: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను బురిడీ కొట్టించడం పరిపాటిగా మారింది. రెండు నెలల క్రితం కలెక్టరేట్‌లో డేటా ఆపరేటర్ పోస్టులు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఈ ఘటనను మర్చిపోకముందే తాజాగా మరో వ్యక్తి ఆరోగ్యశాఖలో ఉద్యోగమంటూ నిరుద్యోగులను నిలువునా ముంచాడు. జిల్లాలో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం కావడం విస్మయానికి గురిచేస్తోంది.

ఇదీ జరిగింది..

జోగుళాంబ గద్వాల జిల్లా ఆరోగ్యశాఖలో గద్వాల మండలానికి చెందిన ఓ యువకుడు రెండేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పల్లె దవాఖాన విభాగంలో సూపర్‌వైజర్ పోస్టులకు త్వరలో కాంట్రాక్ట్ పద్ధతిన అర్హులైన వారిని ఎంపిక చేస్తున్నారని.. తనకు ఆరోగ్యశాఖ అధికారులతో ఏర్పడిన పరిచయంతో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులైన తన స్నేహితులను నమ్మించాడు. అతడి మాటలను నమ్మి గద్వాల మండలానికి చెందిన ఓ నిరుద్యోగి రూ. 50 వేలు ఇవ్వడంతో పాటు తన స్నేహితులకు సైతం ఉద్యోగాలు ఇప్పించాలని ఆరు నెలల క్రితం రూ. 2.70 లక్షలను అందజేశారు. ఇదే తరహాలో తన స్వగ్రామానికి చెందిన సమీప బంధువుతోనూ రూ. లక్ష తీసుకున్నాడు. ఓ స్టూడెంట్ ఆర్గనైజర్ సైతం తన స్నేహితులకు ఉద్యోగం ఇప్పించాలంటూ రూ. లక్ష నగదు అందజేశారు. అయితే రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఊసెత్తకపోవడం.. నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తుండటంతో ఆ స్టూడెంట్ ఆర్గనైజర్ గట్టిగా నిలదీయడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఆరునెలల పాటు ఉద్యోగం కోసం ఎదురుచూసిన కారు డ్రైవర్ సమీప బంధువు చివరకు తాను మోసపోయినట్టు గ్రహించి గద్వాల రూరల్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

స్వచ్ఛంద సంస్థల మాటున..

జిల్లాలో కొందరు స్వచ్ఛంద సంస్థల మాటున నిరుద్యోగులకు ఉద్యోగ వల విసురుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ పోస్టులను ఏజెన్సీల ద్వారా భర్తీ చేస్తామని నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్నారని తెలిసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసుకుని వివిధ పార్టీల నాయకుడిగా చెలామణి అవుతున్న ఓ వ్యక్తి వందలాది మంది నిరుద్యోగులతో రూ. కోట్లు వసూలు చేశాడు. సదరు వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఈ వ్యవహారం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది.

మా దృష్టికి వచ్చింది..



ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిన ఓ ప్రైవేటు కారు డ్రైవర్‌పై ఫిర్యాదు వచ్చింది. ఆరు నెలల నుంచి ఆ కారు డ్రైవర్ పనిచేయడం లేదు. ఈ వ్యవహారంలో సిబ్బంది ప్రమేయంపై ఆరా తీస్తున్నాం. ప్రమేయం ఉంటే తగు చర్యలు తీసుకుంటాం. నిరుద్యోగులు ఇలాంటి విషయాలలో జాగ్రత్తగా ఉండాలి.

– సిద్దప్ప, జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ

మోసపోవద్దు..



ఉద్యోగాల పేరిట ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నిరాకరించాలి. ఇటీవల ఇలాంటి ఘటన చోటుచేసుకోగా, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాం. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి కొందరు డబ్బు వసూలు చేస్తున్నారు. ఉద్యోగాల పేరుతో మోసాలపై ప్రత్యేక నిఘా పెట్టాం.

– శ్రీనివాసరావు, ఎస్పీ

రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు..

ఆరోగ్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన ఘటనపై 25 రోజుల క్రితం గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మోసం చేసిన వ్యక్తి బాధితుడికి తీసుకున్న డబ్బులు ఇచ్చేస్తానని చెప్పడంతో ఫిర్యాదును వెనక్కి తీసుకున్నట్లు తెలిసింది. డబ్బులు ఇవ్వకపోవడంతో మళ్లీ ఈ వ్యవహారం మొదటికి వచ్చింది.

ఐటీసీ గోదాంలో భారీ చోరీ

- రూ. 50 లక్షల విలువైన సిగరెట్లు అపహరణ


ఐటీసీ గోదాం వద్ద చోరీ వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న ఐటీసీ గోదాంలో ఆదివారం తెల్లవారుజామున భారీ చోరీ చోటుచేసుకుంది. బాధితుడు మణికర్ వివరాల మేరకు.. గుర్తుతెలియని దుండగులు గోదాం షట్టర్ తాళాలను పగులగొట్టి రూ. 50 లక్షల విలువైన సిగరెట్లను చోరీ చేశారు. ఉదయం షట్టర్ తెరిచి ఉండటాన్ని గమనించిన బాధిత యజమాని లోపలికి వెళ్లి చూడగా.. 35 – 40 సిగరెట్ కాటన్లు కనిపించలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు గోదాం వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. గోదాంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో చోరీ ఘటన రికార్డు అయినట్లు గుర్తించి, సీసీ పుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. సరిగ్గా తెల్లవారుజామున 2:50 గంటల సమయంలో ముగ్గురు దొంగలు గోదాంలోకి ప్రవేశించి, సిగరెట్ కాటన్లను బయటకు తీసుకువచ్చారు. షోరూం నుంచి కొత్తగా తీసుకువచ్చిన బొలేరో వాహనంలో కాటన్లను లోడ్ చేసి తరలించారు. కొత్త వాహనం కావడంతో రిజిస్ట్రేషన్ కూడా కాలేదు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. కాగా, సీసీ పుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయితే చోరీకి ఒక రోజు ముందే రూ. 60 లక్షల విలువైన సిగరెట్లను దిగుమతి చేసుకున్నామని బాధితుడు తెలిపారు. సిగరెట్ నిల్వలు ఉన్న విషయం తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా ఇదే గోదాంలో దాదాపు రూ. 6లక్షల విలువైన సిగరెట్లు అపహరణకు గురయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జునగౌడ్ తెలిపారు.

బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో..

మరోవాహనాన్ని ఢీకొట్టిన బైక్

- ఇద్దరి దుర్మరణం..ముగ్గురికి గాయాలు
- జనగామ– సూర్యాపేట రహదారిపై ఘటన
- మృతుల్లో వనపర్తి జిల్లా దుప్పల్లి యువకుడు


భరత్ (ఫైల్)

దేవరుప్పుల/మదనాపురం: బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో జనగామ–సూర్యాపేట రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ఎదురుగా టాటా ఏస్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మొగిత గ్రామానికి చెందిన బోయ నర్సింహ(20), తెలంగాణలోని వనపర్తి జిల్లా మదనాపురం దుప్పల్లి గ్రామానికి చెందిన మహేందర్, భాగ్యమ్మ దంపతుల కుమారుడు భరత్(21) బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి ప్లంబర్ పనిచేస్తున్నాడు. అందులో భాగంగా జనగామ జిల్లా కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ఓ ఇంట్లో ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. పని నిమిత్తం ఆదివారం ఉదయం బైక్‌పై దేవరుప్పుల మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట రహదారి గొల్లపల్లి బస్‌స్టేజీ సమీపంలో జనగామ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా టాటా ఏస్ వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో నర్సింహ, భరత్ రహదారిపై ఎగిరిపడి అక్కడికక్కడే దుర్మరణం పొందారు. టాటాఏస్‌లో ప్రయాణిస్తున్న సింగరాజుపల్లికి చెందిన రాపాక ఉప్పలయ్య, రేణుక దంపతులు, కొంగరి భాస్కర్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో లభించిన సెల్ ఫోన్‌ల ఆధారంగా పోలీసులు మృతులను గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి వరకు మృతుల కుటుంబీకులు రానున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంపై పలువురు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనతో దుప్పల్లిలో విషాదం చోటు చేసుకుంది.

శానిటేషన్ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న యాదయ్య

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్ పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళితే.. కొన్నేళ్ల నుంచి జిల్లా జనరల్ ఆస్పత్రిలోని శానిటేషన్ విభాగంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న యాదయ్య ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే యాదయ్య ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆర్‌ఎంఓ డాక్టర్ జరీనా తెలిపారు. ఆత్మహత్యాయత్నం ఎందుకు చేశాడో అనే వివరాలు తెలియాల్సి ఉంది. అయితే శనివారం కార్మికుల మధ్యలో చిన్నపాటి ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో తనపై కొందరు కార్మికులు దాడి చేశారని యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కార్మికుల మధ్య జరిగిన అంతర్గత వ్యవహారాలే కారణమా? లేక ఇంకా ఇతర కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది.

పట్టపగలే ఇంట్లో చోరీ

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు సమీపంలోని పవనపుత్ర కాలనీకి చెందిన రవికుమార్ ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి ఉదయం 11:30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా.. తాళం పగిలిపోయి కనిపించింది. గుర్తుతెలియని దుండగులు బీరువాను ధ్వంసం చేసి 5 గ్రాముల బంగారం, కొంత నగదు చోరీ చేసినట్లు గుర్తించిన బాధితుడు.. పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అమ్మచెరువులో మొసలి సంచారం



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని అమ్మచెరువులో ఆదివారం మొసలి మళ్లీ కనిపించింది. స్థానిక యువకులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. చెరువు ఇళ్ల సమీపంలో ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వీలైనంత త్వరగా బంధించి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు..


రవీందర్ నాయక్ (ఫైల్)

ధరూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన కొత్తపాలెం స్టేజీ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుకూర్ కథనం మేరకు.. కేటీదొడ్డి మండలం ఇర్కిచేడు తండాకు చెందిన రవీందర్‌నాయక్ (23) బైక్‌పై తన అవ్వగారి ఊరైన కొత్తపాలెం గ్రామానికి వెళ్లాడు. రాత్రి సమయంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా గద్వాల–రాయచూరు ప్రధాన రహదారిపై కొత్తపాలెం స్టేజీ వద్ద ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరిలో కలుపు నివారణే కీలకం


సాగు చేసిన వరి పంట

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: ఉమ్మడి జిల్లాలో వరి పంట సాగు పూర్తి చేశారు. వరితో సహా ఏ పంటలోనైనా దిగుబడిపై ప్రభావితం చేసేది కలుపు. ఈ కలుపు వల్ల దాదాపు 35 శాతం పంట నష్టం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. సరైన సమయంలో కలుపును నివారించకపోతే 40 శాతం వరకు దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వరిలో కలుపు నివారణ చర్యలను ఆయన వివరించారు.

నాటిన 3 నుంచి 5 రోజు మధ్య..

వరి నాటిన 3 లేక 5 రోజుల లోపు పొలంలో 3 నుంచి 5 సెంటిమీటర్ల నీటిని నిల్వ ఉంచి ఎకరానికి 4 కిలోల 2, 4 డీ ఇథైల్ ఎస్టర్ లేదా 4 కిలోల బ్యూటక్లోర్ గుళికలను 25 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలం అంతట సమానంగా పడే విధంగా చల్లాలి. లేదా లీటర్ నీటికి 35 గ్రాముల ఆక్సిడయార్జిల్ లేదా 80 గ్రాముల పైరజో సల్ఫురాన్ ఇథలైస్ కలిపి ఆ తర్వాత దానిని 25 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలం అంత సమానంగా పడేలా చల్లాలి. పొలం అంత పలుచగా నీరు పెట్టి వీటిని చల్లుకోవాలి. ఈ మందులు చల్లిన రెండు మూడు రోజుల వరకు పొలంలోని నీరు బయటికి పోకుండా బయటి నీరు లోపలికి రాకుండా చూడాలి.

గడ్డి జాతీ మొక్కలు (ప్రత్యేకించి ఊద ఎక్కువగా ఉంటే)..

ఎకరానికి 500 మి.లీ. అనిలోఫాస్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ లేదా 1.5 లీటర్ల బెంధియోకార్బ్‌ను 25 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో పలుచగా నీరు ఉంచి పొలం అంత సమానంగా పడేటట్లు చల్లాలి.

నాటిన 8–12 రోజుల మధ్య..

ఎకరానికి 37.5 మి.లీ ఫెనాక్సులమ్‌ను బురద పదునులో పిచికారీ చేసి మరుసటి రోజు తేలిక పాటి నీరు పెట్టాలి. గడ్డి, తుంగ, వెడల్పాకు కలుపు మొక్కల నివారణకు ఉపయోగపడుతుంది.

నాటిన 15–20 రోజుల మధ్య..

నాట్లు వేసిన 3–5 రోజుల లోపుగానీ 8–12 రోజుల లోపుగానీ కలుపు మందుల వాడకం కుదరనప్పుడు 15–20 రోజుల మధ్య మందుల ద్వారా కలుపు నివారించవచ్చు. గడ్డి జాతి వెడల్పాటి ఆకుల కలుపు మొక్కలు ఎక్కువగా ఉంటే పొలం నుంచి నీటిని తీసి ఎకరానికి 80–100 మి.లీ. బిస్పైరిబాక్ సోడియంను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

నాటిన 25–35 రోజుల మధ్య..

వెడల్పాకు కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉంటే పొలంలో నీరు తీసేసి ఎకరానికి 400 గ్రాముల 2,4, డీ సోడియం సాల్ట్‌ను లేదా 50 గ్రాముల ఇథాక్సి సల్ఫురాన్‌ను 200 లీటర్‌ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

ప్రేమోన్మాది దాడిలో గాయపడ్డ బాలిక మృతి

పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నందుకే ఘాతుకం..


దస్తగిరమ్మ (ఫైల్)

బద్వేలు అర్బన్/కడప కార్పొరేషన్/కడప రూరల్: వైఎస్సార్ జిల్లా బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలంలో ప్రేమోన్మాది లైంగిక దాడికి పాల్పడి పెట్రోల్ పోసి నిప్పంటించిన హత్యాయత్నం ఘటనలో తీవ్రగాయాలపాలై కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రొద్దుటూరు దస్తగిరమ్మ (16) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా సాయంత్రం బద్వేలులో అంత్యక్రియలు జరిగాయి. మరోవైపు.. 'నా బిడ్డ లేకలేక పుట్టింది. నిష్కారణంగా ఆమెను తగలబెట్టిన వాడిని నాకు అప్పగించండి'.. అని మృతురాలు దస్తగిరమ్మ తల్లి హుసేనమ్మ డిమాండ్ చేశారు. రిమ్స్ మార్చురీ వద్ద ఆమె మీడియా ఎదుట విలపిస్తూ.. ఉన్నత చదువులు చదివి పైకి ఎదగాల్సిన ఆమెను అన్యాయంగా చంపేసిన వాడిని అలాగే తాను మట్టుబెడతానన్నారు. కాగా, దస్తగిరమ్మ తనను పెళ్లి చేసుకోవాలని తరచూ కోరుతున్నందున, ఆమెను అడ్డుతొలగించుకోడానికే విఘ్నేష్ ఈ హత్యచేశాడని, అతను విచారణలో కూడా ఈ విషయాన్ని ఒప్పుకున్నాడని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు.

క్లుప్తంగా...

31న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల: శ్రీవారి ఆలయంలో ఈ నెల 31న ఉదయం 'దీపావళి ఆస్థానం'కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనుంది. ఇందులో భాగంగా మలయప్పస్వామి దేవేరులతో కలిసి బంగారు వాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. విష్వక్సేనుల వారినీ స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపు చేసి స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాదాలను నివేదిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని మాడ వీధులలో విహరిస్తారు. ఈ కారణంగా 31న తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనుంది.

ఇదేమి రాజ్యం బాబూ?

ఎక్స్ వేదికగా నిలదీసిన వైఎస్ జగన్ • శాంతి భద్రతల పరిరక్షణలో కూటమి సర్కారు దారుణ వైఫల్యం



సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌లో కాలేజీ విద్యార్థినిపై పెట్రో లు పోసి నిప్పంటించి ప్రాణాలు తీసిన ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమి రాజ్యం చంద్రబాబూ..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని, అరాచక శక్తుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా వైఎస్ జగన్ కూటమి ప్రభుత్వాన్ని ఆదివారం కడిగిపారేశారు.

ఈ దుర్యోధన దుశ్శాసన.. దుర్వినీతి లోకంలో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడలేకపోతున్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు. ఇదేమి రాజ్యం చంద్రబాబూ? రోజూ ఏదోచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు సర్వసాధారణమైపోయాయి. బద్వేలులో కాలేజీ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పు అంటించి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం, దుర్మార్గం. బాధిత కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నా. ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం కూడా ఉంది. ఒక పాలకుడు ఉన్నాడంటే ప్రజలు ధైర్యంగా ఉండాల్సిందిపోయి నిరంతరం భయపడే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ మీద కక్షకొద్దీ మా పథకాలను, కార్యక్రమాలను ఎత్తివేస్తూ రాష్ట్రం, ప్రజలమీద చంద్రబాబు కక్ష సాధిస్తున్నారు. ఇది

- బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు
- రాష్ట్రంలో రోజూ ఏదో ఒకచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు
- బద్వేలులో విద్యార్థినిపై పెట్రోలు పోసి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం
- ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం ఉంది
- బాలికలు, మహిళల భద్రతకు పూర్తి భరోసానిస్తూ దిశ యాప్ తెచ్చి 31,607 మందికి రక్షణ కల్పించాం
- + బటన్ నొక్కినా, ఫోన్‌ను ఐదుసార్లు కదిపినా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం.. పోలీసులు నిమిషాల్లో చేరుకునేలా చర్యలు తీసుకున్నాం
- + 1.56 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకుని భరోసా పొందుతున్న 'దిశ'పై రాజకీయ కక్ష ఎందుకు?

అన్యాయం కాదా? వైఎస్సార్‌సీపీ హయాంలో మహిళలు, బాలికల భద్రతకు పూర్తి భరోసానిస్తూ తీసుకొచ్చిన విప్లవాత్మక ''దిశ''కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చడం దీనికి నిదర్శనం కాదా? తద్వారా మహిళలు భద్రతను ప్రశ్నార్థకం చేసిన మాట వాస్తవం కాదా? ''దిశ''యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కినా, చేతిలో ఉన్న ఫోన్‌ను ఐదుసార్లు అటూ ఇటూ ఊపినా వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, అక్కడ నుంచి దగ్గర్లో ఉన్న పోలీసులకు సమాచారం వెళ్తుంది. వెంటనే పోలీసులు వారికి ఫోన్ చేస్తారు. ఫోన్ ఎత్తకపోయినా లేదా ఆపదలో ఉన్నట్లు ఫోన్లో చెప్పినా ఘటనాస్థలానికి నిమిషాల్లో చేరుకుని రక్షణ కల్పించే పటిష్ట వ్యవస్థను మీరు (చంద్రబాబు) ఉద్దేశపూర్వకంగా నీరుగార్చలేదా? ''దిశ''ప్రారంభం నుంచి 31,607 మంది మహిళలు, బాలికలు రక్షణ పొందితే దాన్ని ఎందుకు దెబ్బతీశారు చంద్రబాబూ? 1.56 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకుని భరోసా పొందుతున్న 'దిశ'పై రాజకీయ కక్ష ఎందుకు? దిశ కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేకంగా 13 పోక్సో కోర్టులు, 12 మహిళా కోర్టులు, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశాం. ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాం. 900 బైక్‌లు, 163 బొలేరో వాహనాలను ''దిశ''కార్యక్రమం కోసమే పోలీసులకు అందించి పెట్రోలింగ్‌ను పటిష్ట పరిచాం. 18 'దిశ'పోలీస్‌స్టేషన్లను నెలకొల్పి 18 క్రైమ్ మేనేజ్‌మెంట్ వాహనాలను సమకూర్చాం. వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశాం. మా హయాంలో శాంతి భద్రతలపై నేను నిర్వహించిన సమీక్షల్లో 'దిశ'కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. దీంతో పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండేవారు. వీటన్నింటినీ నిర్వీర్యంచేసి ఏం సాధించాలనుకుంటున్నారు చంద్రబాబూ? ఇవాళ మీరు చేస్తున్నదల్లా మహిళల రక్షణ, సాధికారత కోసం అమలవుతున్న కార్యక్రమాలను, స్కీమ్‌లను ఎత్తివేయడం! ఇసుక, లిక్కర్ లాంటి స్కామ్‌లకు పాల్పడుతూ పేకాట క్లబ్బులు నిర్వహించడం! పోలీసు వ్యవస్థ కూడా అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తుతూ ప్రతిపక్షంపై తప్పుడు కేసులు బనాయిస్తూ వేధింపులకు దిగడమే పనిగా పెట్టుకుంది. మహిళలు, బాలికలు, చిన్నారుల రక్షణ బాధ్యతలను విస్మరించింది. ఇదేమి రాజ్యం చంద్రబాబూ?.

అంతులేని అఘాయిత్యాలు



ఏపీలో నాలుగు నెలల్లోనే 74 అత్యాచారాలు, లైంగిక వేధింపులు

వీరిలో ఏడుగురు దారుణంగా హత్య
వేధింపులు తట్టుకోలేక ఐదుగురు ఆత్మహత్య

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కూటమి పాలనలో హడలిపోతున్న మహిళలు, బాలికలు

అక్కడ అబలల ఆర్తనాదాలు.. ఇక్కడ బాబు, బాలకృష్ణ 'ఆహా' ఓహో!

- వరుస అత్యాచారాలు, హత్యలతో ఆంధ్రప్రదేశ్ అల్లకల్లోలం..
- బాలకృష్ణ 'షో' షూటింగ్‌లో ఛిల్ అవుతున్న సీఎం చంద్రబాబు


ప్రోగ్రాంకి హాజరైన సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

తెనాలిలో యువతిపై పెమ్మసాని అనుచరుడి పాశవిక దాడి

- కుమార్తెను బతికించుకునేందుకు ఆస్పత్రుల చుట్టూ తిరిగిన కుటుంబ సభ్యులు
- గుంటూరు సమగ్ర వైద్యశాలలో వెంటిలేటర్‌పై బాధితురాలు


పెమ్మసానితో నిందితుడు నవీన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/తెనాలి రూరల్: టీడీపీకి చెందిన రౌడీషీటర్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడి పాశవిక దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఓ యువతి చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. ఆదివారం తెనాలిలో ఈ దారుణం చోటు చేసుకుంది. తెనాలి అయితానగర్‌కు చెందిన 26 ఏళ్ల మధిర సహానా ఓ స్పీచ్ అండ్ హియరింగ్ థెరపీ సెంటర్‌లో పనిచేస్తోంది. శనివారం సాయంత్రం డ్యూటీకి వెళ్లిన బాధితురాలిని కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన రౌడీషీటర్ రాగి నవీన్ (కొంతకాలంగా తెనాలిలో నివాసం ఉంటున్నాడు) తన పుట్టిన రోజు అని నమ్మించి వెంట తీసుకువెళ్లాడు. కొద్ది గంటల అనంతరం తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి పరారయ్యాడు. అనంతరం అక్కడకు చేరుకున్న యువతి తల్లిదండ్రులు వైద్యుల సూచనల మేరకు మంగళగిరి, గుంటూరు తదితర ప్రాంతాల్లో ఎయిమ్స్ సహా పలు ప్రైవేటు వైద్యశాలలకు తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆదివారం తెల్లవారుజామున తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తీసుకురాగా అక్కడి వైద్యులు గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. వెంటిలేటర్‌పై ఉన్న బాధితురాలి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు..

తమ కుమార్తెపై నిందితుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒంటిపై పలు చోట్ల గాయాలున్నాయని.. మెడ, తల కమిలిపోయిందని, దాడి చేసి గాయపర్చినట్లు నల్ల మచ్చలు శరీరంపై ఉన్నాయని బాధితురాలి తల్లి విలపించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈవీఎంల హ్యాకింగ్ చాలా సులభం

▶ మొదటి పేజీ తరువాయి

పెన్సిల్వేనియాలోని ఫిలడెల్ఫియాలో జరిగిన బహిరంగ సభలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

ఈవీఎంల సాఫ్ట్‌వేర్ ఉత్తమం కాదు..

''ఈవీఎంలను చాలా సులభంగా హ్యాక్ చేయవచ్చు. ముఖ్యంగా ప్రభుత్వం ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌ను ఇకా చాలా తేలిగ్గా హ్యాక్ చేయవచ్చు. నాకు కంప్యూటర్ అంటే ఇష్టం. అయితే కంప్యూటర్లు ఓటింగ్ ట్యాబ్‌లేషన్‌ను కలిగి ఉండకూడదు. ఈవీఎంల్లో వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉత్తమమైనది కాదు. ఎన్నికల్లో పేపరు బ్యాలెట్లు మాత్రమే ఉపయోగించాలి. ప్రతి వ్యక్తి నేరుగా పోలింగ్ బూత్ వద్దకు వచ్చి లైన్‌లో నిలబడి ఓటింగ్ హక్కు వినియోగించుకోవాలి''అని మస్క్ పేర్కొన్నారు. ఈవీఎంల ద్వారా భారత్‌లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజాగా ఎలన్ మస్క్ వ్యాఖలు మరోసారి చర్చకు దారి తీశాయి. ఈవీఎంల ద్వారా కాకుండా పారదర్శకత కోసం బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సైతం డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

ఓ అభ్యర్థి గెలిచేలా రీ ప్రోగ్రామింగ్ చేయవచ్చు

ఈవీఎంల పనితీరుపై ఎలన్ మస్క్ తొలి నుంచి అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈవీఎంలో కాలం చెల్లిన మైక్రోసాఫ్ట్‌కు చెందిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారని, దీంతో వీటిని హ్యాక్ చేయడం అత్యంత సులభమని, ఈ విషయాన్ని ఒక టెక్నాలజీ నిపుణుడిగా చెబుతున్నట్లు జూలైలో మస్క్ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. 2017లో సెనేట్ ఇంటెలిజెన్స్ విచారణలో ఈ విషయం బయటపడిందని, ఓ అభ్యర్థి గెలిచే విధంగా ఓట్లను దొంగిలిస్తూ ఈవీఎంలను రీ ప్రోగ్రామింగ్ చేయవచ్చని స్పష్టం చేశారు. అమెరికా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సహా మరే విధంగానూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతిని వినియోగించకూడదని మస్క్ గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాపాలనను జీర్ణించుకోవడం లేదు..



స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలనను చూసి బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. 56 రోజుల్లోనే డీఎస్సీని పూర్తిచేసి 11 వేల మందికి టీచర్ పోస్టులను ఇచ్చి రికార్డు సృష్టించిందన్నారు. గ్రూప్-1 పరీక్షను ఎక్కడా విజయవంతంగా పూర్తి చేస్తామో అనే భయంతో ఈ పరీక్షను వాయిదా వేయించాలని కేటీఆర్, కొంతమంది బీజేపీ నాయకులు అభ్యర్థుల్ని రెచ్చ గొడుతున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రి హోదాలో ఉండి బండి సంజయ్ జీవో నంబర్ 29ని బూచిగా చూపించి ప్రభుత్వంపై బట్టకాల్చి వేయాలని చూస్తున్నారన్నారు. మూసీపై చిల్లరరాజకీయాలు చేస్తే కేటీఆర్, హరీశ్‌రావులకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రైతు భరోసా ప్రతి రైతుకు ఇచ్చే విధంగా కృషి చేస్తున్నామని, సన్నలకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ఎన్‌పీ. వెంకటేశ్, అజ్మత్‌అలీ, రాములుయాదవ్, ఫయాజ్, బండిమల్లేష్ ఉన్నారు.

కఠోర శ్రమతోనే ఉన్నతస్థాయికి..


మాట్లాడుతున్న ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

వనపర్తి: కఠోర శ్రమతోనే ఉన్నత స్థానానికి చేరుకోవడం సాధ్యమవుతుందని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఆదివారం ఉదయం జిల్లాకేంద్రంలో బంధువులతో కలిసి గణేశ్ ఆలయంలో హోమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయనను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి, ఎంపీ డా. మల్లు రవి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల కలెక్టర్లు ఆదర్శ్ సురభి, బదావత్ సంతోష్, బీఎం సంతోష్, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. తర్వాత ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కళ్యాణసాయి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలల విద్యార్థినులు 50 మందికి సైకిళ్లు పంపిణీ చేశారు. ఎస్‌బీఐ సంజీవని క్లినిక్ ఆన్‌వీల్స్ కార్యక్రమంలో ఇంటి వద్దకే వైద్యసేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సేవలు జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు ప్రాంతంలో అందుబాటులోకి రానున్నాయి.

మంజూరు పత్రాలు అందజేత..

పీఎం విశ్వకర్మ యోజనలో భాగంగా వనపర్తి జిల్లాలోని 185 మంది లబ్ధిదారులకు రూ.1.47 కోట్ల చెక్కుతో పాటు మంజూరు పత్రాలు అందజేశారు. ముద్ర రుణ పథకం కింద 50 మంది లబ్ధిదారులకు రూ.50 లక్షల చెక్కులను, స్వయం సహాయక సంఘాలకు రూ.31.96 కోట్ల రుణ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ఎస్‌బీఐ ముందుంటుందన్నారు. ఏటా దేశవ్యాప్తంగా వెయ్యి ప్రభుత్వ పాఠశాలలు, వెయ్యి పీహెచ్‌సీలు ఎంపికచేసి అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. వనపర్తి జిల్లాలో ఎస్‌బీఐకి 55 శాతం బ్యాంకు డిపాజిట్లు, 45 శాతం మార్కెట్ షేర్ ఉందని వివరించారు. పీఎం విశ్వకర్మ రుణాల మంజూరులో తెలంగాణ ఎస్‌బీఐ బృందం దేశంలోనే 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు.

'పాలమూరు'ను అభివృద్ధి చేయాలి..

ఎస్‌బీఐ చైర్మన్‌గా ఎంపికైన తొలి తెలుగు వ్యక్తిగా చల్లా శ్రీనివాసులుశెట్టి చరిత్రలో నిలిచిపోతారని.. పాలమూరును పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని ఎంపీ మల్లు రవి కోరారు. 'క్లినిక్ ఆన్ వీల్స్' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. వెనుకబడిన పాలమూరులో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు సహకారం అందించాలని ఎమ్మెల్యేలు కోరారు. అనంతరం ఎమ్మెల్యేలు ఆయనను శాలువాతో సత్కరించారు. అలాగే మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, స్థానిక పలు సంఘాల నాయకులు ఆయనను కలిసి శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

తెలుగు వారికి గర్వకారణం..

దేశంలోనే అతిపెద్ద సంస్థ ఎస్‌బీఐకి తెలుగువారు చైర్మన్ కావడం రెండు రాష్ట్రాల ప్రజలకు గర్వకారణమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి అన్నారు. పుట్టి పెరిగిన గద్వాల, వనపర్తి ప్రాంతాలపై మక్కువతో సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. వనపర్తి రాజమహల్‌ను పునరుద్ధరించి, పాలిటెక్నిక్ కళాశాలను స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.

నేటినుంచి అండర్-23 క్రికెట్ టోర్నీ


అండర్-23 టోర్నీ జరిగే ఎండీసీఏ క్రికెట్ మైదానం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని ఎండీసీఏ క్రికెట్ మైదానంలో సోమవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు ఉమ్మడి అంతర్ జిల్లా అండర్-23 పురుషుల లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. త్వరలో వరంగల్, సంగారెడ్డి పట్టణాల్లో జరిగే హెచ్‌సీఏ అండర్-23 చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేయడానికి ఈ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఈనెల 18వ తేదీన క్రికెట్ మైదానంలో ఉమ్మడి జిల్లాలో ఆరు జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు గత కొన్నేళ్ల నుంచి మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాయి. హెచ్‌సీఏ లీగ్ మ్యాచుల్లో సత్తా చాటారు. రానున్న అండర్-23 టోర్నమెంట్‌లో జిల్లా జట్టు రాణించేలా ఉమ్మడి జిల్లా టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టారు.

- ఈ టోర్నమెంట్‌కు ఆరు జట్లను మూడేసి జట్లుగా రెండు గ్రూపులుగా విభజించి ప్రతి రోజు 50 ఓవర్ల మ్యాచ్ నిర్వహించనున్నారు. పూల్-ఏలో మహబూబ్‌నగర్, నారాయణపేట, కొడంగల్, పూల్-బీలో నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జట్లు ఉన్నాయి. తొలి రోజు మహబూబ్‌నగర్-నారాయణపేట, 22న నారాయణపేట-కొడంగల్, 23న కొడంగల్-మహబూబ్‌నగర్, 24న నాగర్‌కర్నూల్-గద్వాల, 25న వనపర్తి-నాగర్‌కర్నూల్, 26న గద్వాల-వనపర్తి, 27న పూల్-ఏ విన్నర్, పూల్-బీ విన్నర్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

క్రీడాకారులు ప్రతిభను చాటాలి



ఉమ్మడి జిల్లా అండర్-23 టోర్నీలో క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవాలి. క్రీడాకారులు తమ వ్యక్తిగత ప్రదర్శనను మెరుగు పరుచుకోవాలి. టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తాం. రానున్న హెచ్‌సీఏ అండర్-23 టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవాలి.

– ఎం.రాజశేఖర్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి

క్రీడా ప్రాంగణానికి రూ.50 లక్షల స్థలం వితరణ


మాట్లాడుతున్న దేశాయి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూర్: క్రీడాకారుల సౌకర్యార్థం రూ.50 లక్షల విలువ చేసే 1.50 ఎకరాల స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతోపాటు రూ.2.97 కోట్ల నిధులతో మినీ స్టేడియం నిర్మించేందుకు ముందుకువచ్చి దేశాయ్ పద్మజ వెంకటేశ్వర్‌రెడ్డి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం మండలంలోని మూలమల్ల గ్రామంలో క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత దేశాయి సరళాదేవి, లక్ష్మారెడ్డిల విగ్రహాలను రాష్ట అడ్వకేట్ మాజీ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని, క్రీడాకారుల సౌకర్యార్థం త్వరలోనే మినీ స్టేడియం నిర్మాణం చేపడుతామన్నారు. దేశాయి లక్ష్మారెడ్డి గ్రామాభివృద్ధి కోసం నిరంతరం పరితపించేవారని, ప్రభుత్వ పాఠశాల, పంచాయతీ భవనం ఇతర వాటికి ఉచితంగా స్థలాలు ఇవ్వడంతోపాటు గ్రామానికి బస్సు సౌకర్యం కూడా కల్పించారని కొనియాడారు. సెంటు భూమి కోసం సొంత అన్నదమ్ములే దాడులు చేసుకుంటున్న ఈ రోజుల్లో 1.50 ఎకరాల స్థలం ఇవ్వడం అభినందనీయమని పద్మజ వెంకటేశ్వర్‌రెడ్డిలను గ్రామస్తులు పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ట్రాఫిక్ కష్టాలు ఇంకెన్నాళ్లు..


సిగ్నల్‌గడ్డపై స్తంభించిన ట్రాఫిక్

జడ్చర్ల సిగ్నల్‌గడ్డపై ఆదివారం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కొన్నేళ్లుగా రోడ్డు విస్తరణ పనులు నెమ్మదిగా సాగుతుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కాగా.. బీఆర్‌ఎస్ నాయకులు సిగ్నల్‌గడ్డ వద్ద ధర్నా నిర్వహించడంతో నలువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఇటు ఎల్‌ఐసీ కార్యాలయం, అటు డిగ్రీకళాశాల, నాగర్‌కర్నూలు వైపు రాఘవేంద్రస్వామి దేవాలయం వరకు వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. రాకపోకలు క్రమబద్ధీకరించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ట్రాఫిక్ తిప్పలు ఇంకెన్నాళ్లు అంటూ వాహనదారులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

– జడ్చర్ల టౌన్

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ రైతులను మోసం చేస్తోందని.. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా దాటవేత ధోరణి అవలంబిస్తోందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఎగవేయడంపై పార్టీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఆదివారం మండల కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో నియోజకవర్గస్థాయి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. రెండు సీజన్లు గడుస్తున్నా ఇప్పటి వరకు రైతులకు రైతు భరోసా అందలేదని, రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్ష నగదుతో పాటు ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. వ్యవసాయశాఖ మంత్రి రైతు భరోసాను ఏకంగా ఎగవేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేసినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలోని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఉద్యమిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో మద్దూరు, కొత్తపల్లి బీఆర్‌ఎస్ నాయకులు సలీం, వీరారెడ్డి, గోపాల్, మధుసూదన్‌రెడ్డి, బసిరెడ్డి, విజయభాస్కర్, మహిపాల్, వెంకటేశ్, నరేశ్, చంద్రశేఖర్, జగదీశ్వర్, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్నియా సేకరణపై అవగాహన పెరగాలి


నటరాజ్‌కు జ్ఞాపికను అందిస్తున్న జీఎన్ రావు

పాలమూరు: మహబూబ్‌నగర్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి అత్యధికంగా 200లకు పైగా కార్నియాలను సేకరించినందుకు ఆదివారం హైదరాబాద్‌లో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నిర్వహించిన ప్రత్యేక వేడుకలో లయన్ నటరాజ్‌కు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఫౌండర్ చైర్మన్ జీఎన్ రావు అవార్డుతో పాటు ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ కార్నియా సేకరణపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, మరణించిన వ్యక్తుల నుంచి కార్నియా సేకరించి చూపులేని వారికి చూపు ప్రసాదించాలని కోరారు.